సాక్షి
పార్వతీపురం మన్యం

శనివారం । 26 । ఆగస్టు । 2023



నెలకోసారి రొయ్యల ధర

ఆక్వా రంగం అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రొయ్యల ధరల నిర్ణయంలో కీలక నిర్ణయం తీసుకుంది. - 8లో



మాదకద్రవ్యాలు లేని సమాజాన్ని నిర్మించాలి

మాదకద్రవ్యాలనుంచి సమాజాన్ని కాపాడాలని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఏడీ కె.కవిత పిలుపునిచ్చారు. - 8లో



విజయదుందుభి

అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో విజయనగరం జిల్లా జట్టు నార్త్‌జోన్ విజేతగా నిలిచింది. - 8లో

న్యూస్‌రీల్

ఓబీసీ రిజర్వేషన్ల సమీక్షలో ఎంపీ 'బెల్లాన'



కేరళలో జరిగే ఓబీసీ కమిటీ సమీక్షలో పాల్గొన్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: ఓబీసీ రిజర్వేషన్లు అమలుపై కేరళలో నిర్వహించిన జాతీయ స్థాయి సమీక్షలో జాతీయ ఓబీసీ కమిటీ మెంబర్, విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పాల్గొన్నారు. గత వారం రోజులుగా జాతీయ ఓబీసీ కమిటీ నేతృత్వంలో రిజర్వేషన్లు అమలుపై స్టడీటూర్ జరుగుతోంది. అందులో భాగంగానే శుక్రవారం కేరళలో మినిస్ట్రీస్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్సిల్ అండ్ సర్వీసెస్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతినిధులతో సమీక్ష జరిగింది.

సీఎం మేలు మరచిపోలేం..

● డిప్యూటీ సీఎం రాజన్నదొర



బొబ్బిలి: గిరిజన ప్రాంతంలోనే గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేసేందుకు ఎంతో కృషి చేసిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి గిరిజనులంతా రుణపడి ఉంటారని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మరడాంలోని ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి పాల్గొన్న సభలో పీడిక రాజన్నదొర మాట్లాడుతూ టీడీపీ హయాంలో గిరిజనేతర ప్రాంతంలో యూనివర్సిటీని స్థాపించేందుకు ప్రయత్నించిన సంగతి తెల్సిందేనన్నారు. కేంద్రంతో మాట్లాడి గిరిజన ప్రాంతంలో వర్సిటీ ఏర్పాటుకు కృషిచేసిన ముఖ్యమంత్రికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో 27.05 గిరిజన విద్యాసంస్థల్లో 20,600 మంది గిరిజన విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు. ముఖ్యమంత్రికి గిరిజనులంటే ప్రత్యేక అభిమానమన్నారు. అందుకే, కొండకోనల్లో జగన్ పేరు ప్రతిధ్వనిస్తోందని తెలిపారు. మెరుగైన, నాణ్యమయిన విద్యనందించేందుకు సీఎం జగన్ కృషి దేశంలోనే చర్చనీయాంశంగా మారిందన్నారు. రాష్ట్రంలో 34 గిరిజన తెగలు ఉంటే 27.39 లక్షల మంది చదువుతున్నారన్నారు. ఇప్పుడు ముఖ్యమంత్రి జగన్ చేస్తున్న విద్యాసంస్కరణల వల్ల 5 శాతం పెరిగిందన్నారు. కురుపాంలో గిరిజన ఇంజినీరింగ్ కళాశాల, పార్వతీపురం, విజయనగరంలలో వైద్య కళాశాలల నిర్మాణాలు జగన్ చేతి చలవేనన్నారు. టీడీపీ హయాంలో కేవలం 40వేల కరాల పోడుభూమికి పట్టాలు ఇస్తే ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నాలుగున్నరేళ్లలో జగన్ మోహన్ రెడ్డి 3 లక్షల ఎకరాల భూమికి గిరిజనులకు హక్కులు కల్పించారన్నారు. 82,62,430 మంది గిరిజన కుటుంబాలకు నాలుగున్నరేళ్లలో వివిధ సంక్షేమ పథకాల కింద రూ.19,950 కోట్ల లబ్ధిచేకూరిందన్నారు.

రామతీర్థంలో శ్రావణ పూజలు






రామతీర్థంలో చందన అలంకరణలో మహాలక్ష్మి, కామాక్షి అమ్మవారికి పూజలు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో శ్రావణ మాసం రెండో శుక్రవారం సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో కొలువుదీరిన శ్రీమహాలక్ష్మి అమ్మవారికి పంచామృతాలతో విశేష అభిషేకాలు జరిపారు. అమ్మవారిని నూతన పట్టువస్త్రాలు, చందనంతో సుందరంగా అలంకరించిన అనంతరం హరిద్రా కుంకుములతో సహస్రనామార్చన జరిపించారు. దేవస్థాన క్షేత్ర పాలకులుగా విరాజిల్లుతున్న ఉమా సదాశివాలయంలో కామాక్షి అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు మల్లిఖార్జునశర్మ, ప్రసాద్, నరిసింహాచార్యులు, కిరణ్‌కుమార్ తదితరులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేవారు.

పుట్టగొడుగుల పంట



చాపరాయిబిన్నిడిలో విరబూసిన పుట్టగొడుగులు

గుమ్మలక్ష్మీపురం: వర్షాల జోరుతో పుట్టగొడుగులు పంట పండుతోంది. ఏజెన్సీ గ్రామాల్లో సహజసిద్ధంగా విరబూసిన పుట్టగొడుగులు పుష్కలంగా లభిస్తున్నాయి. గిరిజన యువత పుట్టగొడుగుల సేకరణలో బిజీ అయ్యారు. కొందరు కిలో పుట్టగొడుగులు రూ.600ల చొప్పున మార్కెట్‌లో విక్రయిస్తున్నారు.

కేంద్రీయ గిరిజన వర్సిటీ... రాష్ట్ర విభజన హామీల్లో ఏపీకి దక్కిన విద్యామణిహారం. ఇన్నాళ్లకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కృషితో 561.88 ఎకరాల్లో శాశ్వత భవనాల నిర్మాణానికి సాలూరు నియోజకవర్గంలోని చినమేడపల్లి వద్ద పునాదిరాయి పడిన వేళ.. విద్యార్థిలోకం హర్షధ్వానాలు చేసింది. జై జగన్ అంటూ నినదించింది. ఉత్తరాంధ్ర విద్యాప్రగతికి గిరిజన వర్సిటీ సోపానం కానుందని పేర్కొంది. విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్న ముఖ్యమంత్రికి జనం జేజేలు పలికారు. జగనన్నే మా నమ్మకం.. మా శ్వాస అంటూ ప్లకార్డులతో మనసారా కృతజ్ఞతలు తెలిపారు.

దత్తిరాజేరు మండలం మరడాం వద్ద సభావేదికపై సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, కేంద్రమంత్రి ధర్మేంద్రప్రధాన్, మంత్రులు బొత్ససత్యనారాయణ, పీడిక రాజన్నదొర, ఎంపీ గొడ్డేటిమాధవి, కలెక్టర్ నాగలక్ష్మి, వీసీ కట్టమణి తదితరులు



గిరిజన వర్సిటీతో ఉత్తరాంధ్రలో
విద్యాప్రగతి





మరడాం వద్ద నిర్వహించని సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి, హాజరైన జన సందోహం

- అట్టహాసంగా గిరిజన విశ్వవిద్యాలయం శంకుస్థాపన మహోత్సవం
- తరలివచ్చిన విద్యార్థులు, ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రజలు
- కిక్కిరిసిన విజయనగరం–సాలూరు 26వ నంబర్ జాతీయ రహదారి
- సభా ప్రాంగణం చాలకపోవడంతో ప్రధాన రహదారిపై కిలోమీటరు మేర బారుల తీరిన జనం
- అభిమాన నేతను చూసి పులకించిన జనం
- భిన్నంగా సాగిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన
- విద్యార్థులను, తల్లిదండ్రులను ఆలోచింపజేసిన సీఎం ప్రసంగం
- ధర్మేంద్ర ప్రధాన్‌కు రాష్ట్ర అభివృద్ధి అంశాలు వివరించిన ముఖ్యమంత్రి

విజయనగరం/బొబ్బిలి/సాలూరు/దత్తిరాజేరు/బొండపల్లి: కేంద్రీయ గిరిజన వర్సిటీ నిర్మాణానికి సాలూరు నియోజకవర్గంలోని చినమేడపల్లి వద్ద శుక్రవారం నిర్వహించిన భూమిపూజ అట్టహాసంగా సాగింది. గిరిజన వర్సిటీతో ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన వేళ... ఈ ప్రాంత ప్రజలంతా చప్పట్లతో స్వాగతించారు. రాష్ట్రంలో ఆర్థికంగా, సామాజికంగా రాజకీయంగా వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి వెనుకాడడం లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గిరిజనుల పట్ల, వెనుకబడిన జాతులు, తెగల పట్ల తమ అనుకూల వైఖరిని సుస్పష్టం చేశారు. దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని పార్వతీపురంమన్యం, విజయనగరం ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విప్లవాత్మకమైన మార్పులు సంతరించుకుంటున్నాయని ఉదాహరణలు, వివరణలతో ప్రజలకు తెలియజేశారు. ముందుస్తుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం 11.05 గంటలకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, కేంద్ర విద్యా, నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్‌లు ముందుగా చినమేడపల్లిలో శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించిన అనంతరం గజపతినగరం నియోజకవర్గం పరిధిలోని మరడాంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు హాజరయ్యారు. వీరికి అంతకు ముందు హెలిప్యాడ్ వద్ద జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు సాదర స్వాగతం పలికారు. ఏ ప్రాంతమైన అభివృద్ధి చెందాలంటే విద్యతోనే సాధ్యమని నమ్మే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మార్పులు చేస్తున్న విషయాలతో పాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాలను కూడా విడమర్చి చెప్పారు. అభివృద్ధిని చేసి చూపుతున్నామన్నారు. తాజాగా గిరిజన ప్రాంత విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడేలా 561.88 ఎకరాల విస్తీర్ణంలో రూ.830 కోట్లతో కేంద్రీయ గిరిజన శ్వవిద్యాలయానికి భూమి పూజచేసినట్టు వెల్లడించారు.



ముఖ్యమంత్రికి చిరుజ్ఞాపికను అందజేస్తున్న గిరిజన వర్సిటీ వీసీ కట్టమణి

గతానికి భిన్నంగా...

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటన గత పర్యటనలకు భిన్నంగా సాగింది. ప్రతిపక్షంపై ఎటువంటి విమర్శలు, ఆరోపణలు చేయకపోగా... వైఎస్సార్‌సీపీ హయాంలో గత నాలుగేళ్ల మూడు నెలల కాలంలో అమలు చేసిన పథకాలను, ప్రజలకు చేసిన లబ్ధిని వివరిస్తూ ప్రసంగించారు. ప్రభుత్వ హయాంలో గిరిజనులకు చేసిన మేలును వివరించిన ముఖ్యమంత్రి... గిరిజన విశ్వవిద్యాలయం నిర్మాణ పనులను రానున్న మూడేళ్లలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో సభికులు హర్షధ్వానాలు చేశారు. ప్రశాంతత, హుందాతనం కలగలపిన వాతావరణంలో గిరిజన విశ్వ విద్యాలయానికి శంకుస్థాపన చేయడం తో పాటు క్లుప్తమయిన ప్రసంగాలతో సభ ముగిసింది. ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రికి జేసీ కె.మయూర్ అశోక్, అసిస్టెంట్ కలెక్టర్ సహజిత్ వెంకట త్రినాథ్, ఎమ్మెల్సీలు పాలవలస విక్రాంత్, పిసురేష్ బాబు, ఇందుకూరు రఘురాజు, దువ్వాడ శ్రీనివాస్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు పాముల పుష్పశ్రీవాణి, బొత్స అప్పలనర్సయ్య, శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, కడుబండి శ్రీనివాసరావు, అలజంగి జోగారావు, విశ్వాసరాయి కళావతి, కంబాల జోగులు, ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకర రావు, మారిటైం బోర్డు చైర్మన్ కాయల వెంకట కృష్ణారెడ్డి తదితరులు వీడ్కోలు పలికారు.

ఎడ్లబళ్లపై సీఎం సభకు..



కృష్ణాపురం నుంచి ఎడ్లబళ్లపై ముఖ్యమంత్రి సభకు వస్తున్న గ్రామస్తులు

దత్తిరాజేరు: మండలంలోని మరడాం వద్ద జరిగిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సభకు వి.కృష్ణాపురం గ్రామస్తులు 20 ఎడ్లబళ్లపై సర్పంచ్ మార్పిన ఎర్రయ్యమ్మ, ఉప సర్పంచ్ తిరుపతి దంపతులు ఆధ్వర్యంలో చేరుకున్నారు. నాలుగున్నరేళ్లుగా సంక్షేమ పాలన సాగిస్తున్న సీఎంను దగ్గరగా చూసి మురిసిపోయారు.

జిల్లా అభివృద్ధిలో ఇదో మైలురాయి

● కలెక్టర్ నాగలక్ష్మి



బొబ్బిలి: గిరిజన విశ్వవిద్యాలయం జిల్లాకు రావడం, తరగతులు ప్రారంభం కావడం, సొంత భవనాల నిర్మాణాలకు శంకుస్థాపన చేయడం అంతా ఉమ్మడి విజయనగరం జిల్లా అభివృద్ధిలో ఓ మైలురాయి అవుతుందని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్‌లు వేదికను అలంకరించిన తరువాత సభను ప్రారంభిస్తూ ఆమె స్వాగతోపన్యాసం చేశారు. 11 విభాగాలతో 380 మంది విద్యార్థులతో ఏయూ క్యాంపస్ భవనాల్లో ప్రస్తుతం తరగతులు సాగుతున్నాయన్నారు. మర్రివలస, చినమేడపల్లి గ్రామాలకు చెందిన 440 మంది రైతుల నుంచి భూములు కొనుగోలుచేసి వర్సిటీని నిర్మించుకోవడం శుభపరిణామమన్నారు. రూ.30 కోట్ల పరిహారం చెల్లింపుంతో పాటు అరులైన్ల రోడ్డు, తాగునీటి సరఫరా సదుపాయాలకు రూ.20.49 కోట్లు ఖర్చుచేయనున్నట్టు వెల్లడించారు. త్వరలో ఉత్తరాంధ్ర విద్యాభివృద్ధిలో గిరిజన విశ్వవిద్యాలయం కీలకం కానుందన్నారు.

తరలివచ్చిన విద్యార్థిలోకం

గిరిజన వర్సిటీ శంకుస్థాపన మహోత్సవానికి ఉమ్మడి జిల్లాలకు చెందిన విద్యార్థులు, ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. విజయనగరం–సాలూరు మీదుగా వెళ్లే 26వ నంబర్ జాయతీ రహదారి కిక్కిరిసిపోయింది. 11.30 గంటల సమయానికి ముఖ్య అతిథులు సభా ప్రాంగణం వద్దకు చేరుకోగా... ప్రాంగణంలోకి వెళ్లేందుకు స్థలం లేక ప్రధాన రహదారిపై కిలోమీటరు మేర ప్రజలు బారులు తీరారు. సీఎం తమ ప్రాంత విద్యాభివృద్ధికి చేస్తున్న కృషిని వివరిస్తుంటే జై జగన్ అంటూ నినదించారు. సభకు హాజరైన మహిళలు, విద్యార్థులు మా నమ్మకం నువ్వే జగనన్న.. మా శ్వాస నీవే.. థాంక్యూ సీఎం సర్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. జగనన్న నిలువెత్తు కటౌట్‌లను ప్రదర్శించారు. గిరిజనులకు గతంలో ఏం జరిగిందో... ఇప్పుడు ఏం జరుగుతోందో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర స్పష్టంగా వివరించారు. గిరిజన ప్రాంతానికి దూరంగా విశాఖపట్నానికి దగ్గరగా టీడీపీ నాయకులు నిర్మించ తలపెట్టిన దానిని కాదని, గిరిజనులకు, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఒడిశా ప్రాంతాలకు అతి దగ్గరగా ఏర్పాటు చేసే విషయంలో కేంద్ర, రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి చేసిన ప్రయత్నాలను రాజన్నదొర సభలో సవివరంగా తెలియజేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి రాజన్న దొర భుజంతట్టి అభినందించారు.




మా నమ్మకం.. మా శ్వాస.. నువ్వే జగనన్న అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినదిస్తున్న బాలికలు



స్మైల్ ప్లీజ్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్‌తో ఫొటోదిగిన ప్రజాప్రతినిధులు

సాదర స్వాగతం

వర్సిటీ శంకుస్థాపనకు వచ్చిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు జిల్లా ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం పుష్పగుచ్ఛాలు, దుశ్శాలువలతో సత్కరించారు. స్వాగతం పలికిన వారిలో డిప్యూటీ సీఎం రాజన్నదొర, మంత్రి బొత్స సత్యనారాయణ దంపతులు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ గొడ్డేటి మాధవి, ఎమ్మెల్సీలు పాలవలస విక్రాంత్, పిసురేష్ బాబు, ఇందుకూరు రఘురాజు, దువ్వాడ శ్రీనివాస్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు పాముల పుష్పశ్రీవాణి, బొత్స అప్పల నర్సయ్య, శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, కడుబండి శ్రీనివాసరావు, అలజంగి జోగారావు, విశ్వాసరాయి కళావతి, కంబాల జోగులు, శెట్టి ఫల్గుణ, ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకర రావు, మారిటైం బోర్డు చైర్మన్ కాయల వెంకట కృష్ణారెడ్డి, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ దీపికాపాటిల్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, మాజీ ఎమ్మెల్యే సవరపు జయమణి, ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, మారిటోరియం బోర్డ్ చైర్మన్ కాయల వెంకట్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి పావని తదితరులు పాల్గొన్నారు.డీసీఎంఎస్ చైర్‌పర్సన్ అవనాపు భావన, విక్రమ్, డీసీసీబీ చైర్మన్ వేచలపు చినరామినాయుడు తదితరులు ఉన్నారు.



హెలిప్యాడ్ నుంచి సభాస్థలికి సీఎం, కేంద్రమంత్రిని తీసుకొని వస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

సైడ్‌లైట్స్

- ఉదయం 9.30 గంటలకు గ్యాలరీలు నిండిపోయాయి. విద్యార్థుల కోసం ఉంచిన గ్యాలరీల్లోకి బయట ఉండిపోయిన విద్యార్థులను అనుమతించమని మైక్‌లో ఆదేశించడంతో హర్షాతిరేకాలు వ్యక్తంచేస్తూ ఆశీనులయ్యారు.
- మా నమ్మకం... మా శ్వాస నువ్వే జగనన్న అంటూ విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శించారు.
- సీఎం సభా ప్రాంగణానికి వచ్చేటప్పుడు జై జగన్ అంటూ పెద్దఎత్తున నినదించారు.
- గిరిజన సంక్షేమ శాఖ మంత్రి ప్రసంగం బాగుందంటూ పీడిక రాజన్నదొరను సీఎం భుజం తట్టి అభినందించారు.
- సభ జరుగుతుండగా బయట తనను కలవడానికి వచ్చిన గరివిడికి చెందిన క్యాన్సర్ బాధితురాలికి ఆర్థిక సహాయం చేయాలని కలెక్టర్ నాగలక్ష్మికి సీఎం సూచించడంతో ఆమె వెంటనే వేదిక దిగి సిబ్బందికి సంబంధిత ఆదేశాలు జారీ చేశారు.
- పెద్ద వీణను బహుకరించినప్పుడు స్వీకర్త కేంద్రమంత్రితో పాటు పలువురు ఆసక్తిగా తిలకించారు.
- సభ పూర్తయిన అరగంట తర్వాత వర్షం కురవడాన్ని రైతులు వై.ఎస్.కుటుంబ ఆనవాయితీ అంటూ కితాబిచ్చారు.
- యూనివర్సిటీ నిర్మాణానికి స్థలం ఇచ్చిన రైతులకు, కుంటినివలస, పాతరేగ, కొత్తరేగ గ్రామాల ప్రజలకు ముఖ్యమంత్రి అభివాదం చేసిన సమయంలో జై జగన్ అంటూ నినదించారు.







అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

గిరిజన విశ్వవిద్యాలయం శంకుస్థాపన సందర్భంగా మరడాం సభావేదికపై పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన గిరిజన సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను అలరించాయి. కురుకుట్టి కొమ్ములుండు చేసిన నృత్యాలు అబ్బురపరిచాయి. తలపై దీపాలు పెట్టుకుని చేసిన గీతాలు, థింసా నృత్యాలు సభికులను కట్టిపడేశాయి.

క్లుప్తంగా

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు



సంఘటనా స్థలంలో క్షతగాత్రులు

సాలూరు: పట్టణంలోని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం సమీపంలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనగా ఇద్దరు వ్యక్తులు గాయాల పాలయ్యాడు. ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. జీగిరాం గ్రామం నుంచి సాలూరుకు ద్విచక్రవాహనంపై వస్తున్న రామభద్రపురం మండలం కొట్టక్కి గ్రామానికి చెందిన ఆదినారాయణ, సాలూరు నుంచి జీగిరాం వెళ్తున్న పాచిపెంట మండలం పెదచీపురువలస గ్రామానికి చెందిన రవి బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ఇద్దరూ గాయపడగా 108లో సాలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆదినారాయణను విజయనగరం ఆస్పత్రికి తరలించారు.

దాడిలో వ్యక్తికి ..

పార్వతీపురం: పొలం పనిలో జరిగిన వాగ్వాదంలో దాడి చేయడంతో గాయాలైన ఓ వ్యక్తి గాయపడ్డాడు. ఈ సంఘటనపై పార్వతీపురం జిల్లా ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జియ్యమ్మవలస మండలం వనజ గ్రామానికి చెందిన జన్ని మాధవరావు వ్యవసాయ కూలీగా పని చేస్తున్నాడు. గ్రామానికి చెందిన ఎ.కేశవరావు పొలంలో ఆకుకట్టలు వేయడానికి మాధవరావు, ఆరిక తిరుపతిరావు, పాలక మోహనరావు, మరికొంతమంది కూలి పనికి వెళ్లారు. అక్కడ పొలంలో అందరూ ఆకు కట్టలను పొలం చుట్టూ విసిరే క్రమంలో కట్టలు అటు విసరకు, ఇటు విసురురా.. అని మాధవరావును అజామాయిషీ చేస్తూ ఆరిక తిరుపతిరావు చెప్పడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో తిరుపతిరావు ఆగ్రహించి రెండుచేతులతో మాధవరావును పిడిగుద్దులు గుద్ది, కింద పడవేసి తన్ని నిన్ను చంపివేస్తే నీకు దిక్కెవరంటూ భయపెట్టాడు. ఈ దాడిలో మాధవరావుకు గాయాలు కావడంతో బాధితుడి బావమరిది పోలిరాజు జిల్లా ఆస్పత్రికి తీసుకు రాగా వైద్యులు చికిత్స అందించారు. ఔట్‌పోస్టు పోలీసులు వివరాలు నమోదు చేశారు.

మాదకద్రవ్యాలు లేని సమాజాన్ని నిర్మించాలి



సమావేశంలో మాట్లాడుతున్న విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు కె. కవిత

పార్వతీపురంటౌన్: మాదకద్రవ్యాల బారినుంచి సమాజాన్ని కాపాడాలని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ సహాయ సంచాలకురాలు కె.కవిత అన్నారు. ఈ మేరకు శుక్రవారం పార్వతీపురంలోని ఐటీడీఏ గిరిమిత్ర సమావేశ మందిరంలో మత్తు పదార్థాల వినియోగం తగ్గింపు, విముక్తి చేసేందుకు తీసుకోవలసిన చర్యలపై జిల్లా అధికారులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వశాఖ సౌజన్యంతో రాష్ట్ర దివ్యాంగుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యమంలో సమాజం, యువత, ఆర్థిక వ్యవస్థపై మాదకద్రవ్యాలు చూపే ప్రభావంపై అవగాహన, మాదక ద్రవ్యాల వల్ల కలిగే చెడుప్రభావంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకురాలు కె.కవిత మాట్లాడుతూ నేడు సమాజాన్ని పట్టి పీడిస్తున్న సమస్యలలో మాదక ద్రవ్యాలు ఒకటని, యువత వాటి బారిన పడకుండా కాపాడాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం అందుకుగాను ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించి, డ్రగ్స్ ప్రభావిత జిల్లాలలో ప్రచారం, అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

విజయనగరంలో పునరావాస కేంద్రం

శిక్షణలో సీడ్ స్వచ్ఛంద సంస్థ ప్రధాన శిక్షకుడు ప్రకాశ్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడేందుకు అందజేయాల్సిన సదుపాయాలు, కుటుంబసభ్యుల సహకారంపై అవగాహన కల్పించారు. సీడ్ స్వచ్ఛంద సంస్థ కో ఆర్డినేటర్ రాజు మాట్లాడుతూ మత్తుపదార్థాలకు బానిసైన వారికి విముక్తి కలిగించేందుకు కేంద్ర ప్రభుత్వ సహకారంతో విజయనగరంలో పునరావాస కేంద్రం నిర్వహిస్తున్నామని, నెలరోజులు ఉచిత వసతి, చికిత్స అందిస్తామని కావున జిల్లాలో మత్తుపదార్థాలకు బానిసలైన వారిని ఈ కేంద్రాలకు తీసుకువచ్చి సేవలు పొందవచ్చని తెలిపారు. చికిత్స అనంతరం కూడా నిరంతరం వారిని పర్యవేక్షిస్తుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డి.భాస్కరరావు, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి ఎం.డి గయాజుద్దీన్, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కె.విజయ గౌరి ఇతర అధికారులు పాల్గొన్నారు.

నెలకోసారి రొయ్యల ధర

● సంఖ్యను బట్టి నిర్ణయం



విజయనగరం ఫోర్ట్:

ఆక్వా రంగం అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అయితే ధరలు తగ్గుదల, పెరుగుదల ఉండడం వల్ల రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో రొయ్యల ధర స్థిరంగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. గతంలో రోజు వారీ ధరలు ఉండేవి. ఇప్పుడు నెలకు ఒకసారి ధరలు ఉండేలా చర్యలు తీసుకుంది. ఇతర జిల్లాలకు, ఇతర దేశాలకు ఇక్కడినుంచి రొయ్యలు ఎగుమతి అవుతున్నాయి.

వెనామి రకం సాగు:

జిల్లాలో వెనామి రకం రొయ్యలను రైతులు సాగు చేస్తున్నారు. ఈరకం రొయ్యలకు డిమాండ్ పెరిగింది. జిల్లాలో ఆక్వా ప్రాసెసింగ్ యూనిట్ ఒకటి ఉంది. ఇక్కడికి కొంతమంది తీసుకు వస్తుండగా, మరి కొంతమంది విశాఖపట్నం తీసుకువెళ్తారు.

148 హెక్టార్లలో ఆక్వాసాగు:

జిల్లాలో 148 హెక్టార్లలో ఆక్వా సాగవుతోంది. ఇందులో మంచి నీటిలో రొయ్యల సాగు 120 హెక్టార్లలో, ఉప్పు నీటిలో 48 హెక్టార్లలో సాగు చేస్తున్నారు.

సంఖ్యను బట్టి ధర నిర్ణయం:

రొయ్యల సంఖ్యను బట్టి ధరల నిర్ణయం ఉంటుంది. ఎక్కువ సంఖ్య ఉంటే ధర తక్కువ ఉంటుంది. .రొయ్యల సంఖ్య తక్కువ ఉంటే ధర ఎక్కువ ఉంటుంది.రోజువారీ ధరలు నిర్ణయించేటప్పుడు రోజుకు ఒక ధర ఉండేది. ఇప్పుడు నెలకు ఒకసారి ఇప్పుడు ధర నిర్ణయించడం వల్ల స్థిరంగా ఉంటుంది.

ధరల వివరాలు:

రొయ్యల కౌంట్	దర రూ.లలో	రొయ్యల కౌంట్	దర రూ.లలో
100	205	30	380
90	215	25	460
80	225	24	480
70	230	23	500
60	240	22	550
50	245	21	580
40	260	20	610

ప్రభుత్వ ధర చెల్లించాలి

రొయ్యల ధరలను గతంలో రోజువారీ నిర్ణయించేవారు. ప్రస్తుతం నెలకు ఒకసారి నిర్ణయిస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరను కంపెనీలు చెల్లించాలి. లేదంటే చర్యలు తీసుకుంటాం.

సత్యనారాయణ, మత్స్య శాఖ డీడీ

ఆంగ్లబోధన ప్రావీణ్య టీచర్లకు పరీక్ష

● 29న ఆన్‌లైన్‌లో నిర్వహణ

● టీచర్స్ డే రోజున విజేతలకు అవార్డులు

విజయనగరం అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మాధ్యమానికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యం పెంచుతోంది. ఈ మేరకు ఇప్పటికే 1 నుంచి 10వ తరగతి వరకు అన్ని సబ్జెక్ట్‌లలో పాఠ్యాంశాల పుస్తకాలు ఆంగ్లమాధ్యమంలో అదనంగా ఇస్తున్న విషయం తెలిసిందే. మరో వైపు ఆంగ్లమాధ్యమంలో బోధించే ఉపాధ్యాయుల ప్రావీణ్యాన్ని మెరుగు పరచడానికి ఎప్పటికప్పుడు వృత్యంతర శిక్షణ తరగతులను విద్యాశాఖ నిపుణులతో నిర్వహిస్తోంది. ఈ క్రమంలో సంబంధిత ఉపాధ్యాయుల నైపుణ్యాన్ని ప్రోత్సహించేందుకు నూతన ప్రక్రియను పాఠశాల విద్యాశాఖ చేపడుతోంది. ఉత్తమ ఇంగ్లిష్ బోధనా నైపుణ్యం చూపిన ఉపాధ్యాయులను ప్రోత్సహించేందుకు వారిని కూడా ఉపాధ్యాయ దినోత్సవం రోజున సత్కరించాలని నిర్ణయించింది.

10,271 మంది టీచర్లు ఈ పరీక్షకు అర్హులు

ఇంగ్లీష్ సబ్జెక్టు టీచర్లతోపాటు ఆంగ్ల మాధ్యమంలో బోధన అందించే అన్ని సబ్జెక్టుల టీచర్లు ఈ పరీక్షకు అర్హులే. ఉమ్మడి విజయనగరం జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ యాజమాన్యాలలో ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్స్, ప్రధానోపాధ్యాయులు కలిపి 11,771 మంది ఉన్నారు. వారిలో తెలుగు, హిందీ, సంస్కృతం సబ్జెక్టులు చెప్పే వారు 1,500 మంది మాత్రమే ఉన్నారు. మిగిలిన 10,271 మంది ఉపాధ్యాయులు ఆంగ్లమాధ్యమంలోనే ప్రతి సబ్జెక్టు చెబుతున్నారు. దీంతో వీరంతా పరీక్షకు అర్హులవుతారు.

సెంటా సహకారంతో ప్రావీణ్య పరీక్ష

సెంటర్ ఫర్ టీచర్ అక్రిడిటేషన్ (సెంటా) భాగస్వామ్యంతో ప్రావీణ్య పరీక్ష నిర్వహిస్తారు. సెంటా టీచింగ్ కోషియంట్ పరీక్షను నేరుగా కాకుండా ఆన్‌లైన్‌లో ఈ నెల 29న నిర్వహించడానికి ఆమోదించింది.

ఇన్నాళ్లకు గుర్తింపు

వైఎస్‌రాజశేఖర్ రెడ్డి ప్రవేశ పెట్టిన సక్సెస్ స్కూల్స్ నిర్వహణలో ఇంగ్లిష్ సబ్జెక్టుకు ప్రాధాన్యం ఉండేది. మళ్లీ ఇన్నాళ్లకు గుర్తింపు వచ్చింది. విద్యాబోధన అంతా ఇంగ్లిష్ మాధ్యమంలోకి మార్చడం వల్ల కీలకమైన సబ్జెక్ట్‌గా ఇంగ్లిష్ మారిన తర్వాత ఉపాధ్యాయుడికి మరింత బాధ్యత పెరిగింది. మారుతున్న బోధన పద్ధతులకు అనుగుణంగా నేటి ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు తనను తాను మార్చుకుంటూ కృషి చేస్తున్నాడు. ఇలాంటి సందర్భంలో ప్రత్యేక ప్రోత్సాహకంగా అవార్డులు ప్రకటించడం ఎంతో అభినందనీయం

మిండి విజయమోహన్,
ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంట్, నందిగామ జెడ్పీహెచ్ఎస్

ఆంగ్లబోధన టీచర్లంతా పరీక్షలో పాల్గొనాలి

ఆంగ్లమాధ్యమంలో పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయులంతా అధిక సంఖ్యలో ఈ పరీక్షలో పాల్గొని ప్రావీణ్యం నిరూపించుకోవాలి. ఆన్‌లైన్‌లో ఈ నెల 29న నిర్వహించే ఈ పరీక్ష అబ్జెక్టివ్ హై క్వాలిటీ అసెస్‌మెంట్ ప్రాసెస్ ఆధారంగా ఉంటుంది. హాజరయ్యే ఉపాధ్యాయులు ఈ నెల 27 లోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. రాష్ట్రవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటున్నారు.

-బి.లింగేశ్వరరెడ్డి,
డీఈఓ

గడ్డి మందు తాగి యువతి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన జ్యోత్స్న

వీరఘట్టం: మండలంలోని కొట్టుగుమడ గ్రామానికి చెందిన బూరాడ జ్యోత్స్న(23) తల్లిదండ్రులు మందలించారని మనస్తాపం చెంది గడ్డి మందుతాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఏఎస్సై ఎస్.రెల్లయ్య తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లాలోని రాగోలు జెమ్స్‌లో బీఎస్సీ నర్సింగ్ సెకెండియర్ చదువుతున్న జ్యోత్స్న ఫస్టియర్ పరీక్షల్లో ఫెయిలైంది. ఈ విషయం తల్లిదండ్రులకు తెలిస్తే ఏమవుతుందోనని భయపడి ఫస్టియర్‌లో పాసైనట్లు ఇంటి వద్ద చెప్పింది. అయితే బీఎస్సీ నర్సింగ్ ఫస్టియర్ ఫెయిల్ అయినట్లు ఆమె ఇంట్లో చెప్పింది. రెండురోజుల క్రితం కాలేజీ నుంచి ఇంటికి వచ్చిన కుమార్తెతో తల్లి రాజేశ్వరి, తండ్రి విజయరావులు గురువారం మాట్లాడారు. ఫస్టియర్ పరీక్షలు పాసైనట్లు ఎందుకు అబద్ధం చెప్పావని ప్రశ్నించారు. నీవు పాసైనట్లు ఊరిలో అందరికీ చెప్పి ఎంతో గర్వపడ్డాం. ఇప్పుడు అందరి దగ్గరా తలదించుకునేలా చేశావని బాధపడ్డారు. అనంతరం తల్లిదండ్రులు పొలానికి వెళ్లారు. మనస్తాపం చెందిన ఉన్న జ్యోత్స్న ఇంట్లో ఎవరూ లేకపోవడంతో గడ్డిమందు తాగేసింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు వెంటనే శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందింది. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తల్లిదండ్రులకు పోలీసులు అప్పగించారు.

నియోజకవర్గ సమీక్ష వాయిదా

విజయనగరం అర్బన్: జిల్లా కలెక్టర్ మీటింగ్ హాల్లో శనివారం జరగాల్సిన గజపతినగరం నియోజకవర్గ సమీక్ష వాయిదా పడిందని ముఖ్య ప్రణాళికా అధికారి పొదిలాపు బాలాజీ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. గత కొన్ని వారాలుగా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బూడి ముత్యాలునాయుడు ఆధ్వర్యంలో ప్రతీ శనివారం నియోజకవర్గాల సమీక్ష నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం జరగాల్సిన గజపతినగరం నియోజకవర్గ సమీక్ష అనివార్య కారణాల వల్ల నిలిచినట్లు ఆయన పేర్కొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



నక్కరాజు సతీష్

కొత్తవలస: విజయనగరం నుంచి కొత్తవలస వచ్చే ప్రధాన రైలు మార్గంలో కొత్తవలస గెడ్డ సమీపంలో పట్టాలు దాటుతుండగా జనసేన పార్టీ కొత్తవలస మండల అధ్యక్షుడు నక్కరాజు సతీష్ (35) శుక్రవారం మృతి చెందాడు. ఈ మేరకు విజయనగరం రైల్వే ఎస్సై వి.వర్మరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మృతుడి స్వగ్రామం దేవాడ. సతీష్ రైలు పట్టాలు పక్కన తన స్కూటీని పెట్టి పట్టాల అవతలవైపు వెళ్తున్న సమయంలో విజయనగరం నుంచి అత్యంత వేగంగా వస్తున్న బొకారో ఎక్స్‌ప్రెస్‌ను గమనించక పోవడంతో నేరుగా ఢీకొట్టింది. దీంతో సతీష్ శరీరం తునాతునకలైంది. ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు మృతుడి కుటుంబసభ్యులకు తెలియజేశారు. సమాచారం మేరకు రైల్వే ఎస్సై రవివర్మ సిబ్బందితో వచ్చి శవపంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్సై తెలిపారు. మృతుడికి తల్లి అచ్చియ్యమ్మ, భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు.



కొత్తవలస: మృతుడి తల్లి, భార్య, పిల్లలు

చెరువులో పడి గిరిజన మత్స్యకారుడు..



బొబ్బిలి: కొర్లాపు అప్పన్న మృతదేహం

బొబ్బిలి: మండలంలోని కారాడ గ్రామానికి చెందిన గిరిజన మత్స్యకారుడు కొర్లాపు అప్పన్న దొర(58) చెరువులో పడి మృతిచెందాడు. శుక్రవారం తెలవారు జామున చెరువులో చేపలకు మేత వేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి పడి మృతిచెందనట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతులకు మేలు జరిగేలా సలహాలు

● వ్యవసాయ సలహామండలి జిల్లా అధ్యక్షుడు

● కలెక్టరేట్‌లో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు

పార్వతీపురం: వ్యవసాయ సలహా మండలి సమావేశంలో రైతులకు మేలు జరిగేలా నిర్ణయాలు తీసుకుని ప్రభుత్వానికి నివేదించాలని పార్వతీపురం మన్యం జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు వాకాడ నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు అధ్యక్షతన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయానికి సంబంధించి ప్రభుత్వ పథకాలు, ప్రకృతి వైపరీత్యాలలో నష్టపరిహారం పొందేందుకు, పంట అమ్ముకోడానికి ప్రతిరైతు తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని పిలుపునిచ్చారు. రైతుభరోసా కేంద్రాల స్థాయి, మండల స్థాయి సలహా మండలి సమావేశాలకు సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

ఈ ఏడాది ప్రతి గింజ కొనుగోలు

జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు మాట్లాడుతూ ఈ సంవత్సరం వరి పంట కొనుగోలుకు లక్ష్యం లేదని రైతు పండించే ప్రతి గింజ కొనుగోలు చేస్తామని, రైతులు పంట అమ్ముకునేందుకు తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని సూచించారు. నెలలో మొదటి శుక్రవారం రైతుభరోసా కేంద్రాల స్థాయిలోను, రెండవ శుక్రవారం మండలస్థాయిలో జరిగే సలహా మండలి సమావేశాలలో తీసుకున్న నిర్ణయాలను, తీర్మానాలను తప్పనిసరిగా పంపించాలని వాటిని జిల్లా స్థాయిలో అమలు చేయగలిగినవి చేసి, మిగిలిన వాటిని పరిష్కారం నిమిత్తం ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం

సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్ పాల్ వ్యవసాయ, అనుబంధశాఖల నివేదిక సమర్పిస్తూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, పంట నమోదులో ప్రకృతి పంటను విడిగా నమోదు చేస్తున్నారని తెలిపారు. జిల్లాలోని గుమ్మలక్ష్మీపురం మండలం మినహా మిగిలిన మండలాలో సాధారణ వర్షపాతం నమోదైందన్నారు. మండలాల్లో జరిగిన సలహామండలి సమావేశాలలో వ్యక్తిగత పనిముట్లు సరఫరా చేయాలని, ధాన్యం సేకరణలో దగ్గర మిల్లులకు ట్యాగింగ్ చేయాలని, రైతుభరోసా భవనాల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలని కోరారు. సమావేశంలో సలహా సంఘం సభ్యులు పారునాయుడు, ఎస్. జనార్దనరావు, నరసింహమూర్తి, జిల్లా కో ఆపరేటివ్ అధికారి సన్యాశినాయుడు, జిల్లా ఉద్యానఅధి కారి సత్యనారాయణరెడ్డి, జిల్లా మత్స్యశాఖ అధికారి తిరుపతయ్య, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు మండల స్థాయి కంట్రోల్ రూమ్

పార్వతీపురం

పార్వతీపురం మన్యం జిల్లాలో ధాన్యం సేకరణకు మండలస్థాయి కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు తెలిపారు. మండలస్థాయి కంట్రోల్ రూమ్‌లో తహసీల్దార్, మండల వ్యవసాయ అధికారి, సీఎస్‌డీటీ లేదా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సబ్‌డివిజన్ స్థాయి సహకార అధికారి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఉంటారని ఆయన చెప్పారు. రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారని ఆయన పేర్కొన్నారు. 2023-24 ఖరీఫ్‌లో ధాన్యం సేకరణ సజావుగా సాగడానికి మండల స్థాయి కంట్రోల్ రూంలు ఏర్పాటు చేస్తున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380-00
బంగారం(22సి. 10గ్రా.)	55,350-00
వెండి (కిలో)	80,000-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹122	₹214	₹ 224

విజయదుందుభి

● నార్త్ జోన్ విజేత జిల్లా జట్టు

● అండర్-16 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో మూడు విజయాలు

● ఆటగాళ్ల సమష్టి ప్రదర్శనతో అగ్రస్థానం



విజయనగరం క్రికెట్ జట్టుతో జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యులు

విజయనగరం రూరల్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి 25 వరకు అండర్- 16 విభాగంలో జరిగిన అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో విజయనగరం జిల్లా జట్టు నార్త్‌జోన్ విజేతగా ఆవిర్భవించింది. తూర్పుగోదావరి జిల్లా జట్టుతో జరిగిన ఆఖరి మ్యాచ్‌లోనూ గెలిచి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలవడమే కాకుండా గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచింది. జిల్లా కేంద్రంలోని బాబామెట్ట శివారు విజ్జి క్రికెట్ మైదానం, చింతలవలసలోని ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో 10 రోజుల పాటు విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం, తూర్పుగోదావరి జట్ల మధ్య టోర్నమెంట్ జరిగింది. ఈ టోర్నీలో ఆతిథ్య విజయనగరం జిల్లా జట్టు మూడు విజయాలతో 18 పాయింట్లు సాంపాదించి అగ్రస్థానంలో నిలవగా, విశాఖ జట్టు రెండు విజయాలు సాధించి 14 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. తూర్పుగోదావరి జట్టు ఒక డ్రా, రెండు ఓటములతో 3 పాయింట్లు, శ్రీకాకుళం జట్టు రెండు ఓటములు, ఒక డ్రాతో 1 పాయింట్ సాధించి తరువాత స్థానాల్లో నిలిచాయి.

9 వికెట్ల తేడాతో గెలుపు

విజయనగరం జట్టు ఆఖరి మ్యాచ్‌లో చింతలవలస ఎంవీజీఆర్ మైదానంలో తూర్పుగోదావరి జట్టుతో తలపడింది. మూడు రోజుల పాటు జరిగిన మ్యాచ్‌లో తూర్పుగోదావరి జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 201 పరుగులు చేయగా, విజయనగరం జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 317 పరుగుల భారీ స్కోర్ చేసింది. జట్టు ఓపెనింగ్ బ్యాట్స్‌మన్ దుర్గేష్‌నాయుడు సెంచరీ చేయగా (119 పరుగులు), మిడిలార్డర్ బ్యాటర్ లోహిత్ రెడ్డి అర్ధసెంచరీతో (59 పరుగులు) రాణించాడు. అనంతరం 116 పరుగుల లోటుతో ఆఖరిరోజు శుక్రవారం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన తూర్పుగోదావరి జట్టు విజయనగరం జట్టు బౌలర్ల ధాటికి 120 పరుగులకే కుప్పకూలింది. విజయనగరం జట్టు బౌలర్ ఫణీంద్ర 5 వికెట్లు తీసి ప్రత్యర్థి జట్టును కట్టడి చేశాడు. అనంతరం 5 పరుగుల విజయలక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన తొలి ఓవర్‌లోనే వికెట్ నష్టపోయి విజయలక్ష్యాన్ని అందుకున్న విజయనగరరం జట్టు నార్త్ జోన్ విజేతగా నిలిచింది.

అభినందనల వెల్లువ

జట్టు వరుసగా మూడు విజయాలు సొంతం చేసుకోవడంతో కెప్టెన్, ఆటగాళ్లతో పాటు కోచ్‌లు ఎస్ఎస్ఎస్ బహదూర్, చందక రమేష్, చందక చంద్రశేఖర్‌లను జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు, ట్రెజరర్ పి.సీతారామరాజు, నార్త్‌జోన్ క్రికెట్ అకాడమీ చైర్మన్ పి.సన్యాసిరాజు, సెలెక్టర్లు సర్ఫరాజ్, పి.బంగార్రాజు, పీఎస్ఎన్ వర్మలు అభినందించారు.

10 వికెట్ల తేడాతో విశాఖ గెలుపు

బాబామెట్ట విజ్జీ క్రికెట్ మైదానంలో విశాఖ, శ్రీకాకుళం జట్ల మధ్య ఆఖరిరోజు జరిగిన మరో మ్యాచ్‌లో విశాఖ జట్టు 10 వికెట్ల తేడాతో శ్రీకాకుళం జట్టుపై గెలుపొందింది. ఈ విజయంతో విశాఖ జట్టు బోనస్ పాయింట్‌తో 7 పాయింట్లు పొంది పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో నిలిచింది.

స్కోర్ వివరాలు:

శ్రీకాకుళం తొలి ఇన్నింగ్స్: 109/10, రెండో ఇన్నింగ్స్: 121/10

విశాఖ తొలి ఇన్నింగ్స్: 205/10, రెండో ఇన్నింగ్స్: 29/0



విజయోత్సాహంలో జిల్లా క్రీడాకారులు, కోచ్‌లు